17న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ: కలెక్టర్

కలెక్టరేట్, సెప్టెంబరు 6: జాతీయ నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1-19 ఏళ్ల వయసు గల పిల్లలతో ఈ మాత్రలు వేయించాలన్నారు. భోజనం చేసిన అర గంట తర్వాత వేసుకోవాలన్నారు. ఎవరైనా తప్పిపోతే 20న వారికి అందించాలని తెలిపారు. అనంతరం నులిపురుగుల నివారణ కార్యక్రమంపై పోస్టర్లను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు, జీజీహెచ్ సూపరింటెండింట్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆదిదేవుడి పూజకు వేళాయె..

- వినాయక చవితికి జిల్లావాసులు సిద్ధం
- వాడవాడలా మండపాల ఏర్పాటు
- జోరుగా ప్రతిమల విక్రయాలు
- కిటకిటలాడిన మార్కెట్లు



కిటకిటలాడుతున్న విజయనగరం మార్కెట్

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/రాజాం రూరల్, సెప్టెంబరు 6: ఆది దేవుడి పూజకు వేళయ్యింది. శనివారం వాడవాడలా గణనాథుడు కొలువుదీరనున్నాడు. ఇందుకు సంబంధించి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. వివిధ ఆకృతుల్లో మండపాలను తీర్చిదిద్దారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మార్కెట్లు పూజా సామగ్రి కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. ముఖ్యంగా విగ్రహాల విక్రయాలు జోరుగా సాగాయి. నిర్వాహకులు పోటాపోటీగా కొనుగోలు చేశారు. వాహనాల్లో తమ గ్రామాలకు విగ్రహాలను తరలించారు. విజయనగరం, చీపురుపల్లి, రామతీర్థం జంక్షన్, గరివిడి, చీపురుపల్లి, ఎస్.కోట, గజపతినగరం, బొబ్బిలి, రామభద్రాపురం రాజాం, తదితర మార్కెట్లు అడుగుతీసి అడుగు వేయలేని విధంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాలను పంపిణీ చేశాయి. అయితే, చాలామంది రంగురంగుల విగ్రహాలను కొనేందుకే ఉత్సాహం చూపించారు. బయట మార్కెట్లలో విగ్రహాలతో పాటు పూజా సామగ్రి ధరలు పెరిగాయి. గతేడాది గణనాథుడి చిన్నపాటి విగ్రహం ధర రూ.200 ఉండగా ఈ ఏడాది రూ. 400 పైబడి పలికింది. అరటిపళ్ల డజన్ రూ. 70 నుంచి రూ.90 వరకూ పలికాయి. సాధారణ రోజుల్లో రూ.30 విలువ చేసే కొబ్బరికాయ శుక్రవారం సాయంత్రం రూ.50 పలికింది. పూలధరలు కొండెక్కి కూచున్నాయి. ద్రాక్ష, బత్తాయి, సీతాఫలం, జామ, తదితర పండ్ల ధరలకు కూడా రెక్కలొచ్చాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి స్పష్టంగా కనిపించింది. కాగా శని వారం వేకువజామున 3.40 గంటల నుంచి 4.50 వరకు బ్రహ్మ ముహూర్తం, అమృత ఘడియలు ఉన్నప్పటికీ ఉదయం 7.50 నుంచి 12.30 గంటల మధ్య వినాయకపూజ (వ్రతం) చేసేందుకు అనుకూలమైన సమయంగా వేదపండి తులు స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉంటే శుక్రవారం సాయంత్రం జిల్లాలోని బొబ్బిలి, రాజాం తదితర ప్రాంతాలలో వర్షం కురవడంతో కొంతమేర వ్యాపారం స్తంభించింది. ఫుట్‌పాత్ వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వీరంతా శనివారం ఉదయంపై ఆశలు పెట్టుకున్నారు.



వినాయక విగ్రహాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

మట్టి గణనాథులనే పూజిద్దాం

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం (ఆంధ్రజ్యోతి), సెప్టెంబరు 6: ప్రతిఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యా వరణాన్ని కాపాడాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో రూపొందించిన విగ్రహాలకు రసాయన రంగులు వేయడంతో అవి కాలుష్యానికి కారణమవుతున్నాయని తెలిపారు. వాటి స్థానంలో నీటిలో సులభంగా కరిగిపోయే మట్టి ప్రతిమలనే వినియోగించాల న్నారు. మన భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం ప్లాస్టిక్, పాలిథిన్, ప్లాస్టర్ ఆఫ్ పారీస్, ఇతర రసాయన పదార్థాలతో తయారీ చేసిన వస్తువులను విడనాడాలని పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విజయనగరం, గజపతినగరం, బొబ్బిలిలో సుమారు 8 వేల మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో అనిత, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడు పాల్గొన్నారు.



మ్యాప్ పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

శరవేగంగా ఎయిర్‌పోర్టు పనులు

- 2026 జూన్ నాటికి పూర్తి చేస్తాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

భోగాపురం, సెప్టెంబరు 6: భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన ఎయిర్‌పోర్టు పనులను పరిశీలించారు. టెర్మినల్ భవనం, ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్, నేల చదును తదితర పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2026 జూన్ నాటికే విమానాశ్రయం పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు జిల్లా యంత్రాంగం, స్థానిక నాయకుల నుంచి జీఎంఆర్ సంస్థకు సంపూర్ణ సహకారం అందుతుందని చెప్పారు. పనులు త్వరితగతిన పూర్తి చేయించాలనే దృఢ సంకల్పంతో సీఎం చంద్రబాబు ఉన్నారని అన్నారు. ఆయన సూచనల మేరకు ప్రతీ నెల ఎయిర్‌పోర్టు పనులు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికి 40శాతం పనులు పూర్తయ్యాయన్నారు. కవులవాడకు రహదారి ఏర్పాటు చేయాలని, కంచేరు సమీపంలో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక నాయకులు తన దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. వీటిని జిల్లా అధికారులకు తెలియజేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే కర్రోతు బంగార్రాజు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా లన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి, టీడీపీ నెల్లిమర్ల నియోజక ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, ఆర్డీవో ఎంవీ సూర్యకళ, తహసీల్దార్ ఎం.సురేష్, జీఎంఆర్ సీఈవో మనోమే రాయ్, జీఎంఆర్, ఎల్‌అండ్‌టీ సంస్థల ప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలాన్ని అమ్మేశారు

- వైసీపీ ప్రముఖునికి చెందిన కంపెనీ ప్రతినిధుల కొనుగోలు
- దీని విలువ రూ.100కోట్ల పైమాటే
- చీపురుపల్లిలో రిజిస్ట్రేషన్
- తొమ్మిది నెలలుగా గోప్యంగా ఉంచిన వైనం
- న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్న ట్రస్టు సభ్యులు



సీబీఎం బాలికల ఉన్నత పాఠశాల

బొబ్బిలి, సెప్టెంబరు 6: బొబ్బిలి పట్టణంలోని చారిత్రాత్మకమైన సీబీఎం ట్రస్టుకు చెందిన బాలికల ఉన్నత పాఠశాల స్థలాన్ని అమ్మేశారు. దీనికి సంబంధించి గత ఏడాది డిసెంబరు 6న చీపురుపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరిగింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో చాలా గోప్యంగా చక్కబెట్టిన ఈ వ్యవహారం ఇప్పుడు బయటపడింది. సీబీఎం బాలికల ఉన్నత పాఠశాలకు బొబ్బిలి పట్టణ నడిబొడ్డున 1.20 ఎకరాల స్థలం ఉంది. దీని విలువ వంద కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. అయితే, ఈ స్థలాన్ని పట్టణానికి చెందిన ఓ వైసీపీ ప్రముఖునికి చెందిన కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేశారు. దీన్ని చదరపు గజాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. డాక్యుమెంట్ నెంబరు 5671/2023లో 1558.9 చదరపు గజాలు, 5672/2023 డ్యాకుమెంట్ నెంబరులో 345.7 చదరపు గజాలు కొనుగోలు చేసినట్లు ఉంది. ఈ స్థలానికి బదులుగా కోమటిపల్లి గ్రామంలో 1.02 ఎకరాల భూమిని సీబీఎం సంస్థకు బదలాయించుకునే విధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ట్రస్టుకు చెందిన భూమి అసైన్డ్ జాబితాలో ఉండగా వైసీపీ ప్రభుత్వ హయాంలో దాన్ని జిరాయితీగా మార్చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం భారీగా డబ్బులు చేతులు మారినట్లు తెలుస్తోంది. దీనిపై ట్రస్టుకు చెందిన కొంతమంది సభ్యులు ఇప్పటికే జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేశారు. ట్రస్టు ఆస్తిని అన్యాక్రాంతం చేయడం సరికాదని వాపోతున్నారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని అదృష్టకుమార్, గొంటి వేణుగోపాలరావు, విజయ్ తదితరులు తెలిపారు.



డాక్యుమెంట్ కాపీ

ఎన్నో ఏళ్ల నుంచి వివాదం..

ఈ పాఠశాల భూముల విక్రయాలకు సంబంధించి ఎన్నో ఏళ్ల నుంచి వివాదం నడుస్తోంది. ఇది అనేక మలుపులు తిరుగుతోంది. ఈ ఏడాది పాఠశాల గుర్తింపు గడువు ముగిసినందున డిప్యూటీ డీఈవో వచ్చి పాఠశాలను ఖాళీ చేయాలని హుకుం జారీ చేశారు. దీనిపై విద్యార్థినుల తలిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళనలు చేపట్టారు. ఈ ఆందోళనలకు తలొగ్గి పాఠశాల గుర్తింపు రెన్యువల్ కోసం తాజాగా కరస్పాండెంట్ దరఖాస్తు చేసుకున్నారు. గత ఏడాదే పాఠశాల అమ్మకాల ప్రక్రియ జరిగిపోగా ఈ తతంగమంతా ఎందుకు నిర్వహించారో అంతుచిక్కక స్థానికులు జుట్టు పీక్కుంటున్నారు. ట్రస్టు పేరు మీద ఉన్న భూమలను వ్యక్తుల పేరున ఎలా మార్చారన్నది చర్చనీయాంశంగా మారింది. అలాగే అసైన్డ్ భూముల్లో ఉన్నది జిరాయితీగా మార్చారు. దీని వెనుక ఉన్న అదృశ్యశక్తుల ఎవరనేది తేలాల్సి ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఉండడంతో ఈ భూముల విక్రయానికి సహకరించిన అధికారులు, ఉద్యోగులకు ముచ్చెమటలు పడుతున్నాయి.

రికార్డులు క్షుణ్ణంగా పరిశీలిస్తా..

ట్రస్టుకు చెందిన భూములు ఎలా రిజిస్ట్రేషన్ అయ్యాయో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తాం. నేను కొత్తగా వచ్చినందున విషయం తెలియదు. స్కూలు ట్రస్టు బైలాను కూడా తెలుసుకోవాల్సి ఉంది. ట్రస్టు భూములు వ్యక్తుల పేరుకు ఎలా మారాయి? ఎవరు మార్చారు? అలాగే అసైన్‌భూముల మార్పుపై కూడా ఆరా తీస్తాను. వీటన్నిటిపైన కలెక్టర్‌కు నివేదిక అందిస్తా.

-మల్లపురెడ్డి శ్రీను, తహసీల్దార్, బొబ్బిలి

ముంచెత్తిన వాన

- బొబ్బిలి, కొత్తవలసలో కుండపోత
- చెరువుల్లా మారిన రోడ్లు
- మడ్డువలస, గోస్తనీలో గల్లంతై ఇద్దరి మృతి
- మూడు వేల కోళ్లు కూడా..



బొబ్బిలి ఇందిరమ్మకాలనీలో చెరువులా మారిన రోడ్డు



బొబ్బిలి కోట జంక్షన్‌లో..

బొబ్బిలి/కొత్తవలస/రేగిడి/జామి, సెప్టెంబరు 6: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం, శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువల్లో వరద పొంగిపొర్లింది. రోడ్లు చెరువులను తలపించాయి. మడ్డువలస, గోస్తనీలో ఇద్దరు యువకులు గల్లంతై మృతి చెందారు. అలాగే, కోళ్ల ఫారంలోకి వరద చేరడంతో మూడు వేల కోళ్లు మృత్యువాతపడ్డాయి.

తడిసి ముద్దయిన బొబ్బిలి..

బొబ్బిలిలో శుక్రవారం సాయంత్రం సుమారు గంట పాటు కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. జెండా వీధి జంక్షన్‌లో భారీ కటౌట్ నేలకు ఒరిగింది. అదే సమయంలో స్కూలు విద్యార్థులంతా ఇళ్లకు వడివడిగా నడుచుకుంటూ వెళుతున్నారు. వారికి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఇందిరమ్మకాలనీ, నాయుడుకాలనీ, గొల్లపల్లి, పాతబొబ్బిలి, అప్పయ్యపేట తదితర లోతట్టు ప్రాంతాలన్నీ పూర్తిగా నీటితో నిండిపోయాయి. జెండా వీధి జంక్షన్ నుంచి తూర్పుదేవిడి మీదుగా ఎస్‌బీఐ సెంటరు, రాజా కళాశాల రోడ్లపై భారీగా వరద నిలిచిపోయింది. ఇందిరమ్మ కాలనీలో పలు ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. ఆ నీటిని బయటకు తోడుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. బొబ్బిలిలో 54.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



బొబ్బిలిలో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు

మడ్డువలసలో జారిపడిన యువకుడి మృతి

రేగిడి మండలం అంబాడ గ్రామ సమీపంలోని మడ్డువలస కుడి కాలువలో గురువారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన తులుగు వెంకటేష్ (23) గల్లంతయ్యాడు. బయటకు రాలేక నీటిలో మునిగి మృతి చెందాడు. డిగ్రీ వరకు చదువుకున్న వెంకటేష్ గ్రామ వలంటీర్‌గా పని చేశాడు. ఇప్పుడు వలంటీర్ పోస్టు లేకపోవడంతో వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడుగా ఉంటున్నాడు. గురువారం సాయంత్రం గ్రామంలో వినాయక మండపం ఏర్పాటు చేసి తోటి స్నేహితులతో కలసి మడ్డువలస కాలువకు స్నానానికి వెళ్లాడు. అప్పటికే వర్షం కురుస్తుండడం, కాలువలో నీటి ప్రవాహం ఎక్కువ ఉండడంతో ప్రమాదవశాత్తు కాలుజారి వెంకటేష్ గల్లంతయ్యాడు. స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. గంటపాటు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో కాలువ గేట్లు మూసి వెతికారు. అచేతన స్థితిలో బయటపడిన వెంకటేష్‌ను కుటుంబీకులు రాజాం కేర్ ఆసుపత్రికి తరలించా రు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులుధ్రువీకరించడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు శుక్రవారం స్థానిక ఏఎస్‌ఐ రాజారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటేష్ (ఫైల్)

కోళ్లఫారంలోకి వరద..

కొత్తవలస మండలం వీరభద్రపురం పంచాయతీ నరపాంలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా కోళ్లఫారంలోకి వరద చేరింది. దీంతో మూడు వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. రూ.12 లక్షల నష్టం వాటిల్లిందని యజమాని సిరివూరి రామభద్రరాజు తెలిపాడు. మరికొద్ది రోజుల్లోనే ఈ కోళ్లను ఎగుమతి చేయాల్సి ఉందని, ఈలోగా ఈఘోరం జరిగిందని విలపిస్తున్నాడు. అన్ని షెడ్లలోకి నీళ్లు చేరడంతో మరికొన్ని కోళ్లు మృత్యువాత పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కోళ్ల ఫారం పక్కన గెడ్డ ఉండేదని, ఇటీవల గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల కోసం ఈ గెడ్డను కప్పివేశారని గ్రామస్థులు తెలిపారు. దీంతో గెడ్డలో నుంచి వెళ్లాలసిన నీరు పక్కనే ఉన్న కోళ్లఫారంలోకి వెళ్లడంతో కోళ్లు మృత్యువాత పడ్డాయని చెప్పారు. విషయం తెలుసుకున్న రెవెన్యూశాఖ అధికారులు మృతి చెందిన కోళ్లను శుక్రవారం పరిశీలించారు.



మృతి చెందిన కోళ్లు

గోస్తనీలో ఒకరు..

జామి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన బోనీ అజయ్‌కుమార్ (25) గురువారం రాత్రి గోస్తనీ నదిలో గల్లంతై మృతి చెందాడు. అజయ్ విశాఖపట్నం పోర్టు ట్రస్టులో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. వారంలో ఒకరోజు ఇంటికి వస్తుంటాడు. గురువారం ఉదయం ఇంటికి వచ్చిన అజయ్ తన స్నేహితుడితో కలిసి అదేరోజు రాత్రి గ్రామ సమీపంలోని గోస్తనీ నదిలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. అయితే, వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. కుటుంబ సభ్యులు గాలించినా జాడ కనిపించలేదు. శుక్రవారం ఉదయం సోమయాజులపాలెం వద్ద అజయ్ మృతదేహం తేలింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.



అజయ్‌కుమార్ (ఫైల్)




హీరోగా ఎంట్రీ

టాలీవుడ్ అగ్రకథానాయకుడు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభిమానులకు శుభవార్త. ఆయన తనయుడు మోక్షజ్ఞ సినీ అరంగేట్రం ఖరారైంది. శుక్రవారం మోక్షజ్ఞ పుట్టిన రోజు సందర్భంగా ఈ విషయాన్ని ప్రకటించారు. 'హనుమాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటిన ప్రశాంత్‌వర్మ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలకృష్ణ తనయ ఎం తేజస్విని నందమూరి సమర్పణలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మోక్షజ్ఞ స్టైలిష్ లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ 'మోక్షజ్ఞను పరిచయం చేయడం గొప్ప గౌరవం. అలాగే పెద్ద బాధ్యత కూడా. బాలకృష్ణ గారు కథపై, నాపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు. మన ఇతిహాసాల నుంచి స్ఫూర్తి పొందిన కథతో తెరకెక్కిస్తున్నాం. ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్‌ను మరో స్థాయికి తీసుకెళుతుంది' అన్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ 'మోక్షజ్ఞ సినిమాను లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. ఆయన అరంగేట్రానికి సరిపోయే కథతో అద్భుతమైన స్క్రిప్ట్‌తో ప్రశాంత్ వర్మ ముందుకు వచ్చారు. మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తాం' అన్నారు. ప్రేక్షకులను అలరించేందుకు మోక్షజ్ఞ డాన్స్, ఫైట్స్‌లో కఠోర శిక్షణ పొందారు. జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ సోషల్‌మీడియా ద్వారా మోక్షజ్ఞకు అభినందనలు తెలిపారు.

'గేయ కిరీటి' వడ్డేపల్లి కృష్ణ ఇకలేరు

- లలితగీతాల రచయితగా ఖ్యాతి
- సినిమా పాటలతోనూ పేరు
- ఉమ్మడి ఏపీ సెన్సార్ బోర్డు సభ్యుడిగా, నంది అవార్డు కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు
- ఆదివారం అంత్యక్రియలు

ప్రముఖ లలితగీతాల రచయిత, సినిమా పాటల కవి, 'గేయ కిరీటి' బిరుదాంకితుడు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ (76) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. వడ్డేపల్లి కృష్ణ స్వస్థలం సిరిసిల్ల. వెయ్యికి పైగా గేయాలు రాసిన వడ్డేపల్లిని వేములవాడ రాజరాజేశ్వరి ఆలయ నిర్వాహకులు 'గేయ కిరీటి' బిరుదుతో సత్కరించారు. నిరుపేద చేనేత కుటుంబంలో పుట్టిన ఆయన సినారె స్ఫూర్తితో విద్యార్థి దశలోనే గేయ రచన ప్రారంభించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుంచి 'లలిత గీతాల' మీద ఆయన చేసిన పీహెచ్‌డీ పరిశోధన అత్యంత ప్రామాణికమైనదిగా విమర్శకులు చెబుతారు. అక్కినేని నాగేశ్వరరావు నటించిన "పిల్ల జమీందార్" సినిమాలో 'నీచూపులోన విరజాజి వాన...' పాటతో సినీగేయ రచయితగా ఆయన ప్రస్థానం ప్రారంభించారు. "పెద్దరికం" సినిమాలో 'ముద్దుల జానకి పెళ్లికి మబ్బుల పల్లకి తేవలెనే', "భైరవద్వీపం" - 'అంబా శాంభవి...', "పిలిస్తే పలుకుతా" - 'సమతా మమతల సాకారం... పిలిచిన పలికే ఓంకారం' తదితర గీతాలు ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. వడ్డేపల్లి కలం నుంచి జాలువారిన దేశ భక్తి గీతాలెన్నో ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. మరికొన్ని 60 ఆడియో ఆల్బమ్స్‌గానూ వచ్చాయి. ఆరు దశాబ్దాల తెలంగాణ పోరాటాన్ని కళ్ళకు కట్టే 'జయజయహే తెలంగాణ', 'ఆమ్రపాలి', 'రమణీయ రామప్ప' తదితర నలభైకు పైగా సంగీత, నృత్యరూపకాలను రచించారు.



'బలగం' సినిమా నటుడిగా...

వడ్డేపల్లి రాసిన గేయం పూణె బాలభారతి తెలుగు వాచకాల్లో పాఠ్యాంశంగా చేర్చారు. సిరిసిల్ల నేతన్నల ఆత్మహత్యలు, బతుకమ్మ, గోభాగ్యం తదితర అంశాలపై డాక్యుమెంటరీలు రూపొందించారు. 'లావణ్య విత్ లవ్ బాయ్స్', 'ఎక్కడికెళ్తుందో మనసు' సినిమాలకు, 'భక్త పోతన' వంటి టెలివిజన్ ధారావాహికలకు దర్శకత్వం వహించారు. 'బలగం' సినిమాలో నటించారు. తెలుగు సినీ రచయితల సంఘం త్రిదశాబ్ది వేడుకల సందర్భంగా వారం కిందట వడ్డేపల్లి కృష్ణను జీవిత సాఫల్య పురస్కారంతో సన్మానించారు. ఉమ్మడి ఏపీలో నంది అవార్డుల కమిటీ ఛైర్మన్‌గా, సెన్సార్ బోర్డు సభ్యుడిగా, అంతర్జాతీయ బాలల చిత్రోత్సవం, బాలల నంది నాటక పోటీలకు న్యాయనిర్ణేతగా పలు బాధ్యతలు నిర్వర్తించారు. ఆదివారం మధ్యాహ్నం వడ్డేపల్లి కృష్ణ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన అల్లుడు పత్తిపాక ఈశ్వర్ తెలిపారు.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా



హుషారు' చిత్రంతో అందరినీ అలరించిన నటుడు తేజస్ కంచర్ల నటించిన తాజా చిత్రం 'ఉరుకు పటేలా' శనివారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా తేజస్ మీడియాతో మాట్లాడుతూ "హుషారు' తర్వాత చాలా కథలు విన్నాను. ఏదైనా కొత్త ఉంటే సినిమా చేద్దామనుకుంటున్న నాకు దర్శకుడు వివేక్ చెప్పిన పాయింట్ బాగా నచ్చింది. ఆ తర్వాత ఇద్దరం కలిసి కథ తయారు చేశాం. స్క్రిప్ట్ బాగా వచ్చింది. చాలా మంది నిర్మాతలను కలిసి కథ వినిపించాం. అందరూ బాగుందని అన్నారు కానీ నా మీద అంత బడ్జెట్ పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదు. చివరకు మా నాన్న (కంచర్ల బాల భాను) ఈ కథ విన్నారు. ఆయనకు నచ్చడంతో సినిమా తీయడానికి ముందుకు వచ్చారు" అని చెప్పారు. 'తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ కథ ఉంటుంది. అయినా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. లాక్ డౌన్‌లో మూఢ నమ్మకాల గురించి వార్తలు ఎక్కువగా చదివాను. అలాంటి కొన్ని సంఘటనల చుట్టూ కథ అల్లాను. థ్రిల్లర్, కామెడీ జానర్‌లో వినోదభరితంగా ఉంటుంది.' అని చెప్పారు తేజస్. దర్శకత్వం చేయాలనే కోరిక ఉందనీ, అలాగే పాత్ర నచ్చితే స్పెషల్ రోల్స్ కూడా చేస్తానని తెలిపారు.

వివిధ నైపుణ్య కోర్సులపై శిక్షణ

కలెక్టరేట్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సిల్క్ కాలేజీలో ఈనెల 9 నుంచి వివిధ నైపుణ్య కోర్సులపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు, కెమిస్ట్రీ ప్రొడక్షన్(బీఎస్సీ కెమిస్ట్రీ), జూనియర్ స్టోర్ కీపర్(ఇంటర్), సెక్యూరిటీ ఆఫీసర్ (ఏదైనా డిగ్రీ) నాలుగు నెలల పాటు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం సదుపాయం కల్పించి అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 7386713880, 8008201244 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలీస్ వెల్ఫేర్‌డే కార్యక్రమానికి ప్రాధాన్యం

విజయనగరం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పోలీసు వెల్ఫేర్ డే కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో సమస్యలు వివరించేందుకు వచ్చే సిబ్బందిని చాంబర్లోకి పిలిచి వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖపరమైన సమస్యలు తెలుసుకుని విజ్ఞాపనలు స్వీకరించారు. వారి పూర్వాపరాలు పరిశీలించి, వారి అవసరాలకు అనుగుణంగా త్వరితగతిన చర్యలు చేపడతానని ఎస్పీ వకుల్ జిందాల్ సిబ్బందికి తెలిపారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ వకుల్‌జిందాల్ ● తీరప్రాంతాల్లో పర్యటన


మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

భోగాపురం: తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ మత్స్యకారులకు సూచించారు. మండలంలోని రెడ్డికంచేరు, చేపలకంచేరు, ముక్కాం తీర గ్రామాల్లో ఆయన శుక్రవారం రాత్రి పర్యటించారు. అలాగే రెడ్డికంచేరు గ్రామ సమీపంలో ఉన్న ఎయిర్‌పోర్టు చెక్‌పోస్టును సందర్శించి, అక్కడ భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి, అక్కడ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వర్కర్లకు, గ్రామస్థులకు మధ్య వివాదాలు తలెత్తకుండా శాంతియుతంగా మెలగాలని సూచించారు. అనంతరం మత్స్యకార గ్రామాల్లో పర్యటించి తుఫాన్ కారణంగా వేటకు వెళ్లవద్దని సూచించారు. సముద్రంపై చేపలవేట సమయంలో కలిగే ఇబ్బందులను మత్స్యకారులను అడిగి తెలుసుకున్నారు. మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసాలకు గురైతే 1930కి కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐ ఎన్‌వీ ప్రభాకరరావు, ఎస్బీ సీఐ కేకే విజయనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు అభినందనలు

విజయనగరం క్రైం: జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుల్స్ రెండు దొంగతనాల కేసుల్లో నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసినందుకు ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం అభినందించి, ప్రశంసాపత్రం అభినందించారు. 2024 సంవత్సరం ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, కోట్ల మాదప్పవీధిలో జరిగిన రెండు దొంగతనాల కేసుల్లో పశ్చిమబెంగాల్‌కు చెందిన మహ్మద్ మీజాన్, షఫీ కుల్లా ఇస్లాం అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారిపై అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. నేరారోపణ రుజువయ్యే విధంగా, సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో నిందితులిద్దరికీ న్యాయమూర్తి మూడున్నర సంవత్సరాల జైలు శిక్షతో పాటు 2,500 రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ ఈ నెల 5న తీర్పు ఇచ్చారు. జైలు శిక్ష ఖరారు కావడంలో క్రియాశీలకంగా పనిచేసిన టూటౌన్ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్స్ డి.రాధిక, ఐ.శ్రీనివాసరావులను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు

గంట్యాడ/ఎస్‌కోట: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.11,500 జరిమాన విధించినట్టు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ఎస్పీ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండ లంలోని పెంటశ్రీరాంపురం గ్రామానికి చెందిన గందవరపు గోపి 2018 నవంబరు 27న ఎస్.కోట మండలానికి చెందిన ఒక బాలిక(9)ను పాఠశాల నుంచి వస్తున్న సమయంలో ఇంటికి దిగబెడతానని చెప్పి బైక్‌పై ఎక్కించుకున్నాడు. సమీపంలోని ఒక తోటలోకి తీసుకెళ్లి బాలికపై అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై ఆమె తల్లి అప్పటిలో ఎస్‌కోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ అమ్మినాయుడు పోక్సో కేసు నమోదు చేయడంతో విజయనగరం డీఎస్పీలు శ్రావణకుమార్, పి.వీరాంజనేయులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరిచారు. దీనిపై విచారణ చేయగా బాలికపై అత్యాచారం చేసినట్లు రుజువు కావడంతో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నాగమణి శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ జిందాల్ తెలిపారు.

ఘాట్ రోడ్డులో లారీ బోల్తా

● డ్రైవర్ మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు


అహ్మద్‌ఖాన్ (ఫైల్)

పాచిపెంట, సెప్టెంబరు 6: ఘాట్ రోడ్డులో లారీ బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చత్తీస్‌ఘడ్ నుంచి రాజాంకు కమలాపండ్లు లోడుతో లారీ వెళ్తోంది. గురువారం రాత్రి పి.కోనవలస చెక్‌పోస్టు సమీపంలోకి వచ్చేసరికి ఘాట్ రోడ్డులో కొండను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ లారీలో ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. ఒక డ్రైవర్ సోయబ్ అహ్మద్‌ఖాన్(30) అక్కడికక్కడే మృతి చెందగా, అదే రాష్ట్రానికి చెందిన మరో డ్రైవర్ శంకరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు గాయపడిన శంకరరావును సాలూరు సీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. ఈ మేరకు హెచ్‌సీ సమర్పణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

భవనంపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

డెంకాడ: భవనంపైనుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్‌ఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గెద్దవారిపేటకు చెందిన ఎస్.లక్ష్మీనారాయణ (36) భవన నిర్మాణ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో తన సోదరుడు శ్రీనివాస్ నిర్మిస్తున్న ఇంటి పనులకు లక్ష్మీనారాయణ కార్మికుడిగా వెళ్లాడు. నిర్మాణ పనులు చేస్తుండగా పిట్టగోడ పై నుంచి ప్రమాదవశాత్తు పక్కన ఉన్న భవనంపైకి పడిపోవడంతో తలకి బలమైన గాయాలయ్యాయి. వెంటనే సోదరుడు శ్రీను, తోటి కార్మికులు కలిసి విజయనగరం ప్రభుత్వ జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారని తెలిపారు. డెంకాడ ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

సీతానగరం: మండలంలోని పణుకుపేట సెంటర్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పణుకుపేట గ్రామానికి చెందిన వి.సాంబమూర్తి(74) తన గ్రామం నుంచి సైకిల్‌పై కాశీపేట సెంటర్‌కు చికెన్ తీసుకురావాలని వస్తూ రోడ్డు దాటుతుండగా పార్వతీపురం నుంచి విశాఖపట్నం వెళుతున్న నీలకంఠాపురం బస్సు ఢీకొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలో చనిపోయినట్లు తెలిపారు. మృతుడి అల్లుడు వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి

తెర్లాం: విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ఎంఆర్.అగ్రహారం గ్రామానికి చెందిన చేట్ల తవుడు తన ఆవులు మేతకు వెళ్లి తిరిగి వస్తున్నాయి. గ్రామ సమీపంలోని గ్యాస్ గోదాము వద్ద తెగిపడి ఉన్న విద్యుత్‌వైర్లను తొక్కడంతో రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. జీవనాధారమైన రూ.80 వేల విలువైన ఆవులు మృతిచెందాయని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధితుడు కోరారు. సర్పంచ్, వీఆర్వోలు వచ్చి పరిశీలించి ప్రభుత్వం ద్వారా ఆర్థికసాయం వచ్చేలా చూస్తామన్నారు

యాచకుడి మృతి

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్న నారాయణ అనారోగ్యంతో స్థానిక ఒన్‌వే ట్రాఫిక్ కూడలి వద్ద ఉన్న పాతబడిన బస్ షెల్టర్‌లో శుక్రవారం మృతి చెందాడు. భీమిలి మండలం దాకమర్రి గ్రామానికి చెందిన ఇతను చాలా రోజులుగా భిక్షటనతో కాలం వెల్లబుచ్చుతున్నట్లు స్థానికులు తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు

● శంబంగి స్వగ్రామం నుంచే 45 కుటుంబాలు చేరిక


బొబ్బిలి కోటలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో బేబీనాయన

బొబ్బిలి/రూరల్, సెప్టెంబరు 6: బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు స్వగ్రామమైన పక్కి నుంచి 45 కుటుంబాల వారు శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారంతా బొబ్బిలి కోటకు వచ్చి ఎమ్మెల్యే బేబీనాయన సమక్షంలో పార్టీలో చేరడంతో వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు బంకురు బాబూరావు ఆధ్వర్యంలో శంబంగి మజ్జన్నగారి సత్యనారాయణ, బంకురు సత్యంనాయుడు, మురళీమోహన్, ఎస్సీ కాలనీకి చెందిన 45 కుటుంబాల వారు పార్టీలో చేరారు. బొబ్బిలి ప్రాంతంలో బేబీనాయన చేపడుతున్న సేవాకార్యక్రమాలతో పాటు రాష్ట్రంలో సీఎం చంద్రబాబు సాగిస్తున్న అద్భుతమైన పరిపాలనకు తాము ఎంతగానో ఆకర్షితులయ్యామని వారు తెలిపారు. పక్కి గ్రామం నుంచి పెద్దసంఖ్యలో ఇలా పార్టీలో చేరడం హర్షనీయమని, నియోజకవర్గ ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలను పదికాలాల పాటు నిలబెట్టుకునే విధంగా సేవలందిస్తానని బేబీనాయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

పారాది వంతెనపై ట్రాఫిక్ జామ్


పారాది వంతెనపై ప్రవాహం


పారాది వంతెన వద్ద ట్రాఫిక్ జాం

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది జాతీయ రహదారిపై వేగావతి నదిపై ఉన్న వంతెన వద్ద శుక్రవారం ట్రాఫిక్ జామ్ అయింది. సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రయాణీకులు, చాలా ఇబ్బందులకు గురయ్యారు. వంతెన వద్ద పోలీస్ వారు వాహనాలను కంట్రోలు చేయవలిసినదిగా స్థానికులు ప్రయాణీకులు కోరుతున్నారు.

మా భూమిని అప్పగించండి

● వైసీపీ నేతలకు అధికారులు కొమ్ము కాస్తున్నారు
● గొడుకొమ్ము గ్రామానికి చెందిన ఓ కుటుంబం ధర్నా
● తహసీల్దార్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అన్నపూర్ణ కుటుంబం

జామి, సెప్టెంబరు 6: తమకు భూమిని అప్పగించాలని అధికారులను ఏళ్లతరబడి వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదంటూ జామి మండలం గొడుకొమ్ము గ్రామానికి చెందిన నమ్మి అన్నపూర్ణ కుటుంబం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగింది. వైసీపీ నేతలకు అధికారులు కొమ్ము కాస్తున్నారని, తమకు న్యాయం చేయాలంటూ ఆ కుటుంబంలోని మగవారు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ, ఆమె కుమారుడు లవణ్‌కుమార్ మాట్లాడుతూ.. 'గొడుకొమ్ము గ్రామంలోని సర్వే నెంబర్లు 69, 52లో మాకు 64 సెంట్ల జిరాయితీ, 80 సెంట్ల డీపట్టా భూమి ఉంది. మేము పొట్టకూటి కోసం విశాఖపట్నం వెళ్లిపోయాం. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత స్థానిక వైసీపీ నేతలు రెవెన్యూ సిబ్బందితో కలసి రికార్డులు తారుమారుచేసి మా భూమిని వేరే వారికి అమ్మేశారు. దీనిపై తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. దీంతో కోర్టులో కేసు వేస్తే మాకు అనుకూలంగా తీర్పువచ్చింది. దీనిపై మా ప్రత్యర్థి వర్గం కోర్టుకు వెళ్లింది. కానీ, ఈ ఏడాది జనవరిలో మాకు అనుకూలంగా కోర్టు తీర్పు రావడంతో రెవెన్యూ అధికారులు మా భూమిని మాకు బదలాయించారు. కానీ, ఆ భూమిలోకి మమ్మల్ని వెళ్లకుండా స్థానిక వైసీపీ నాయకులు వారి గూండాలతో దాడులు చేయించడంతో పాటు అక్రమంగా కేసులు పెట్టారు. దీనిపై ఎస్పీ, సీఐలకు ఫిర్యాదు చేశాం. మా భూమిలోకి ఎన్నిసార్లు వెళ్లినా దాడిచేస్తున్నారు. తహసీల్దార్, ఎస్‌ఐలకు చెబితే పట్టించుకోవడం లేదు. వీరి వెనుక వైసీపీ నేతలు ఉన్నారు. మాకు న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదు' అని తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ కృష్ణలత వివరణ కోసం ప్రయత్నించగా ఆమె ఫోన్ ఎత్తలేదు. డిప్యూటీ తహసీల్దార్ సునీత వివరణ కోరగా.. 'అన్నపూర్ణ కుటుంబానికి భూమిని బదలాయించాం. ఆ భూమిని వారు సాగుచేసుకోవాలి. అది మా పనికాదు. ఆ కుటుంబానికి 12 ఎకరాలు డీపట్టా భూమి గొడవ ఉంది. దీనిపై వారికి నోటీసులు ఇచ్చి స్వాధీనం చేసుకోవాలని జేసీ ఆదేశాలు ఇచ్చారు. ఆ దిశగా చర్యలు చేపట్టామని' తెలిపారు. కాగా, వర్షంలో తడుస్తూ అన్నపూర్ణ కుటుంబ సభ్యులు ధర్నా కొనసాగించారు. అయితే, న్యాయం చేస్తామని సీఐ రవికుమార్ చెప్పడంతో వారు ఇంటికి వెళ్లిపోయారు.

దారి దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు


పట్టుబడ్డ నిందితుడితో సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైం: జిల్లా కేంద్రంలో వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో దారిదోపిడీకి పాల్పడిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.10 వేల నగదును, సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసు కున్నట్టు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం ఉర్లాం గ్రామానికి చెందిన పి.సంతోషికుమారి, ఈ నెల 5న ఉర్లాం నుంచి బయలుదేరి విజయనగరం రైల్వేస్టేషన్‌లో దిగి, ఆనందపురం వెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వస్తోంది. కాంప్లెక్స్ సమీపంలోని లీలామహల్ థియేటర్ సందులో నుంచి నడుచుకుంటూ వస్తుండగా ముగ్గురు వ్యక్తులు వెంబడించి, అడ్డగించి చేతిలో ఉన్న పర్సుని లాక్కొని, తోసేసి పారిపోయా రు. కిందపడిపోయి, తేరుకుని చేసేసరికి ఎవరూ కన్పించలేదు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేయగా దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ముగ్గురు నిందితుల్లో ఒకరైనా పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన చింతా ఆనంద్‌ని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

పొదుపు సంఘాల సొమ్మును వాడుకున్నారు

బొబ్బిలి రూరల్: పొదుపు సంఘాల సొమ్మును వీవోఏ తన సొంత ఖర్చులకు వాడుకున్నారని సంఘం సభ్యులు ఆరోపించారు. మండలంలోని అలజంగి గ్రామంలో శుక్రవారం పొదుపు సంఘాల సభ్యులు పెంకి పార్వతి, పొట్నూరు సత్యవతి విలేకర్లతో మాట్లాడారు. పొదుపు సంఘం వీవోఏ పద్మావతి తమ పొదుపు సంఘాల సొమ్మును సొంత ఖర్చులకు వాడుకున్నారన్నారు. గ్రామంలోని సుమారు 100 పొదుపు సంఘాలనుంచి కోట్ల రూపాయల వరకు, తమ సొంతానికి వాడుకుందని, ఒక్కో సంఘం నుంచి రెండు లక్షల మేర బకాయిలున్నట్టు బ్యాంకు నుంచి నోటీసులు వస్తున్నాయని తెలిపారు. తాము కడుతున్న మొత్తాలు పొదుపు సంఘ ఖాతాలకు చేరడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకాలు అడిగితే ఇవ్వడంలేదని దీంతో అనుమానం కలిగి ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేశామని, ఇప్పటికైనా శాఖాపరమైన దర్యాప్తు నిర్వహించి తమకు వడ్డీల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. దీనిపై పద్మావతిని వివరణకోసం ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరని ఆమె భర్త మోహనరావు తెలిపారు.

వరద బాధితులకు సీపీఐ విరాళాల సేకరణ

కొత్తవలస: శృంగవరపుకోట నియోజకవర్గ సీపీఐ సమితి ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు సాయం అందించడానికి విరాళాల సేకరణ చేపట్టారు. శృంగవరపుకోట నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి డేగల అప్పలరాజు ఆధ్వర్యంలో కొత్తవలసలోని ప్రతి ఒక్కరినీ విరాళాలు కోరారు. 6వేల 410 రూపాయలు రాగా వాటిని తమ పార్టీ ద్వారా పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్.కోట మండల కార్యదర్శి కె.బీముడు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి యువజన మాసోత్సవం

విజయనగరం రింగురోడ్డు: రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 8 నుంచి యువజన మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చైర్మన్ జయకృష్ణ, డైరక్టరు అశోక్ మంచుకొండ తెలిపారు. శుక్రవారం ఓ ప్రైవేటు హోటల్‌లో యువజన మాసోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ మాసోత్సవాల్లో చెస్, కబడ్డీ, టెన్నికాయిట్, టెన్నీ కాయిట్ బాక్స్ క్రికెట్, ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్, క్విజ్, స్పాట్ పెయింటింగ్, కుకింగ్, సైన్స్ ఫెయిర్, స్టార్ ఆఫ్ విజయనగరం వంటి కార్యక్రమాలు నిర్వహించి అక్టోబరు 2న విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు అరిశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శిరేయి శంకరరెడ్డి, టీఎల్ఎస్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాదారాధన-2024 సంగీత పోటీలు

విజయనగరం రూరల్: విజయనగరం రోటరీ క్లబ్ ఆఫ్ విజయనగరం కమ్యూనిటీ ప్రాజెక్టులో భాగంగా రోటరీ ద్వారం నర్సింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ద్వారా నడుస్తున్న రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా ఆన్‌లైన్‌లో ప్రపంచ వ్యాప్తంగా కర్ణాటక సంగీత పోటీలు 'నాదారాధన-2022 ' అనే పేరుతో నిర్వహించనున్నట్టు అకాడమీ ప్రతినిధులు డాక్టరు శ్రీకాంత్, మండపాక రవి, జి వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని అకాడమీ కార్యాలయంలో నిర్వహించారు. చోడిమల్లి గిరిజా కుమారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నారాధాన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తారని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన దేశ, విదేశీయులు 94410 42236 నెంబరుకు ఫోన్ చేసి, వివరాలు తెలుసుకోవాలని కోరారు.

వైరల్ జ్వరాలపై అవగాహన

బొబ్బిలి: పట్టణ పరిధిలోని 16 వ వార్డులో శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ శెట్టి ఉమాదేవి ఆధ్వర్యంలో వైరల్ జ్వరాలపై అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, ఇతర చర్మవాధ్యుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. నివాస ప్రాంతాలలో చెత్తాచెదారాలు , మురుగునీరు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలబారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచి వడపోసిన నీటినే తాగాలని ఉమాదేవి సూచించారు.

పేదలకు చీరలు పంపిణీ

శృంగవరపుకోట: శృంగవరపుకోట పందిరప్పన్న కూడలిలో గురువారం రాత్రి కాజా ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో 20 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశా రు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వీటిని అందించామని ఫౌండేషన్ నిర్వాహకులు ఉపాధ్యాయులు శెట్టిరాజ్‌కుమార్, దుర్గాశ్రీనివాసరావు, కిలోవెంకట నారాయణ పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

వేపాడ: వినాయక చవితి ఉత్సవాల్లో పూజా కార్యక్రమాలకు మట్టి విగ్రహాలనే వినియోగించాలని సోంపురం జడ్పీ పాఠశాల ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత ఆతవ రవిశంకర్ ప్రజలకు సూచించారు. పాఠశాలలో శుక్రవారం పర్యావరణ మిత్ర వినాయకుల తయారీ వర్క్ షాప్‌ను ఏర్పాటు చేశారు.

నేత్రదానం కుటుంబ సంప్రదాయం కావాలి


ర్యాలీ చేస్తున్న దృశ్యం

రాజాం: నేత్రదానం కుటుంబ సంప్రదాయం కావాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు పిలుపు నిచ్చారు. శుక్రవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణాంతరం ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కల్యాణ్ మగటపల్లి నేత్ర సేకరణ కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు. ● నేత్రదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆదర్శనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కిరణ్‌కుమార్ కోరారు. శుక్రవారం జిల్లా అంధ త్వ నివారణ సంస్థ, రోటరీ క్లబ్, ప్రభావతి జాగృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నేత్రదానంపై బొబ్బిలి రోడ్డు కూడలి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వరద ముంపు ప్రాంతాల పరిశీలన

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో ముంపునకు అవకాశం ఉండే లోతట్టు ప్రాంతాలు, చెరువు గట్లను మున్సిపల్ కమీషనర్ లాలం రామలక్ష్మి పరిశీలించారు. టీబీఆర్ థియేటర్ రోడ్డు, జయప్రకాశ్ స్కూలు రోడ్డు, పూల్‌బాగ్, టీటీడీ కల్యాణమండపం రోడ్లలో నిలిచిపోయిన వరదనీటిని వ్యాక్యూమ్ క్లీనర్‌తో బయటకు తోడించారు. ఆమె వెంట ఏఈ సురేష్, ఎస్‌ఐ మురళి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరు సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పశుగణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

బొబ్బిలి: వికసిత భారత్ -2047 లక్ష్యానికి అనుగుణంగా పశుగణాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నట్లు పశుసంవదర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టరు డాక్టర్ రెడ్డి నీలయ్య తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. బొబ్బిలి డివిజన్ పరిధిలో గల 19 మండలాల్లో ఒక్కొక్క మండలానికి 30 చొప్పున మినీ గురుకులాలను మంజూరు చేశామన్నారు. నాలుగు పశువుల వరకు 90 శాతం చొప్పున ఉపాధి హామీ పథకం నుంచి సబ్సిడీ ఇస్తున్నారన్నారు. ఆరు పశువులకు 70 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ● గొర్రెల యూనిట్‌కు 20 ఉంటే 1.30 లక్షలు, 50 గొర్రెలుంటే 2.30 లక్షల రూపాయలను 70 శాతం సబ్సిడీతో మంజూరు చేసినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో 1684 పశువులకు బీమా పథకం వర్తింపజేసినట్లు తెలిపారు. 400 రూపాయల ప్రీమియం చెల్లించిన పాడి రైతులకు 15 వేల నుంచి 30 వేల రూపాయల వరకు బీమా వర్తిస్తుందన్నారు. కిలో 6.40 రూపాయల ధరపై 60 శాతం సబ్సిడీతో దాణా అందజేస్తున్నామన్నారు. పశువుల్లో లంపీస్కిన్ వ్యాధి టీకాలు వేశామన్నారు. మందులకు ఎటువంటి కొరత లేదని డాక్టర్ నీలయ్య తెలిపారు.

సామాజిక తనిఖీ - ప్రజావేదిక

బొబ్బిలి రూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఉపాధి హామీ పథకం, సమన్వయ శాఖలపై 30 పంచాయతీల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పాత్రికేయులు పాల్గొనాలని ఎంపీడీవో రవికుమార్ కోరారు.

గిరిజనుల సమస్యలపై నివేదిక

బొబ్బిలి రూరల్: మండలంలోని మోసూరువలస గిరిజన గ్రామంలో ప్రభుత్వ ఇళ్ల నిర్మాణం కోసం(పొజిషన్ ధ్రువీకరణ కోసం) గతంలో గ్రామానికి చెందిన జోగమ్మతో పాటు మరికొంత మంది రాష్ట్ర గిరిజన కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం తహసీల్దార్ ఎం శ్రీను, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కల్యాణ చక్రవర్తి, సర్వేయర్ వెళ్లి గ్రామంలో సమస్యపై సమగ్ర విచారణ జరిపారు. అనంతరం గృహ నిర్మాణ అధికారులతో సమీక్ష చేసి సమస్య పరిష్కారం కోసం నివేదిక తయారు చేసి రాష్ట్ర గిరిజన కమిషన్ చైర్మన్‌కు పంపించామన్నారు.

గిరిజన విద్యార్థికి ఆర్థిక సాయం

శృంగవరపుకోట రూరల్: మండలంలోని రాజీపేట శంబలనగిరి తపస్వీ చారిటబుల్ సభ్యులు గిరిజన విద్యార్థికి శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఒరిసాలోని బొండా జాతికి చెందిన మంగళ ముదులీ అనే యువకుడు బరంపురం వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. విషయం తెలుసుకున్న తపస్వీ చారిటబుల్ ప్రతినిధులు మల్కాజ్ గిరి జిల్లా బడ్డేల్ గ్రామంలో నివసిస్తున్న యువకుడుతో పాటు కుటుంబసభ్యులను కలిసి అభినందించారు. రూ.25 వేలు నగదు, వెండినాణెం, లాప్‌ట్యాప్, దుస్తులు, బ్యాగ్‌లు, నోటుపుస్తకాలు, పెన్నులు ఇచ్చి గ్రామస్థులకు మిఠాయిలు పంచారు.

రేపు బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు

తెర్లాం: మండలంలోని నెమలాం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం సబ్ జూనియర్ బాలబాలికల అండర్-16 బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహిస్తున్నట్టు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఇక్కడ ఎంపికైన వారు ఈ నెల 13, 14, 15 తేదీల్లో అన్నవరంలో జరగనున్న అంతరజిల్లా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి శీధర్ ఉన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడిగా ఉమా

వంగర: మండల కేంద్రంలోని రైతు ఉత్తత్తిదారుల భవన్‌లో శుక్రవారం రైతు ఉత్పత్తులదారుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. 29 పంచాయతీలకు చెందిన సభ్యులు మద్దివలసకు చెందిన వి.ఉమామహేశ్వరరావును అధ్యక్షుడిగా, శివ్వాకు చెందిన గోపీనాయుడును ఉపాధ్యక్షుడిగా, అసిరినాయుడు, ఆదినారాయణ, తుమ్మి ధర్మారావులను కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. వీరిచేత ఏపీవో మంగమ్మ ప్రమాణస్వీకారం చేయించారు. అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఆర్థిక సంఘ నిధులు విడుదల

రామభద్రపురం: మండలంలోని 22 పంచాయతీలకుగానూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి రెండో విడత కింద రూ.1.58 కోట్ల ఆర్థిక సంఘ నిధులు విడుదలైనట్టు ఎంపీడీవో రమామణి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ వెంకటరమణతో కలిసి శుక్రవారం విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టైడ్ కింద రూ. 60 లక్షల 35 వేల 732లు, అన్‌టైడ్ కింద రూ.40 లక్షల 22 వేల 468లు విడుదలై పంచాయతీల ఖాతాలకు ఎడ్జస్ట్ అయ్యాయన్నారు. ఏపీవో త్రినాథరావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన సదస్సు

సంతకవిటి: మండల పరిధిలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మందరాడలో శుక్రవారం మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వికాస తరంగిణి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రమణమూర్తి మాష్టారు, సంతకవిటి పోలీసు స్టేషన్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ వంజరాపు జనార్ధనరావు, కానిస్టేబుల్ కడగల రామినాయుడులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

వేపాడ: మండల కేంద్రంలోని 3 అంగన్వాడీ కేంద్రాల్లో సెప్టెంబర్ 1నుంచి 30 వరకు నిర్వహిస్తున్న పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని కేంద్రాల కార్యకర్తలు మంగలక్ష్మి, బి.దేవి, బి.రాజేశ్వరి సారథ్యంలో శుక్రవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, సున్నా నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలు, కిశోర బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

● **తెర్లాం:** మండలంలోని యు.గదబవలస గ్రామంలో పోషకాహార మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో రాజ్యలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలు రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు ఏయే ఆహారం తీసుకోవాలి అనే దానిపై సూచనలు, సలహాలు అందించారు. అనంతరం వెయ్యి రోజుల సంరక్షణ గురించి తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కే.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.


వేపాడ: అవగాహన కల్పిస్తున్న దృశ్యం


పోషకాహారంపై సూచనలు చేస్తున్న దృశ్యం

నరవ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

గంట్యాడ: నరవ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పతివాడ అప్పలనారాయణమ్మను విధుల నుంచి తప్పిస్తూ డ్వామా పీడీ ఉత్తర్వులు జారీ చేశారని మండల ఏపీవో సుందరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని విధులు నిర్వహణ సమయంలో అప్పలనారాయణమ్మ అనేక అక్రమాలకు పాల్పడినట్లు గ్రామానికి చెందిన కొంతమంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు జరిపిన విచారణలో ఆమె అక్రమాలకు పాల్పడినట్టు రుజువయ్యింది. దీంతో ఆమెను విధుల నుంచి తప్పించినట్టు ఏపీవో తెలిపారు.

కవులవాడ రహదారిని పరిశీలించిన కలెక్టర్

భోగాపురం: కవులవాడ గ్రామానికి వెళ్లే రహదారిని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం పరిశీలించారు. కవులవాడ రోడ్డు ఎయిర్‌పోర్టు ఏర్పాటులో భాగంగా తొలగించడంతో దానికి ప్రత్యామ్నయంగా ఎయిర్‌పోర్టు ప్రహరీ పక్క నుంచి మట్టిరోడ్డు ఏర్పాటు చేశారు. అయితే ఆ రహదారి కొద్ది పాటి వర్షం పడినా పూర్తి గోతులమయంగా మారి రాకపోకలు ఇబ్బందికరంగా తయారవుతోంది. దీంతో కవులవాడ గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ రహదారిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎంవీ సూర్యకళ, తహసీల్దార్ ఎం.సురేష్, సర్వేయర్ మధుకేశవరావు, ఆర్.కిషోర్, వీఆర్వోలు కాళీ, రాంనాయుడు పాల్గొన్నారు.

పెదమానాపురంలో రక్తనమూనాల సేకరణ

దత్తిరాజేరు: పెదమానాపురంలో ఫైలేరియా కేసులు అధికంగా ఉన్నందున జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు గ్రామంలో రక్తనామూనాలు సేకరించినట్టు దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం గ్రామంలో నైట్‌బ్లడ్ సాంపిల్ కలెక్షన్ ప్రోగ్రాం నిర్వహించామని చెప్పారు. 200ల శాంపిల్స్ లక్ష్యానికిగానూ 150 రక్త నమూనాలు సేకరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి హెచ్‌ఎస్ రాజేంద్రకుమార్, దత్తిరాజేరు పీహెచ్‌సీ హెచ్‌ఎస్ అర్జున్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పి పి.జ్యోతి, ఎంపీహెచ్‌ఏ పివి.సన్యాసిరావు, ఏఎన్‌ఎం టి.రమణమ్మ, ఆశా కార్యకర్తలు ఎస్.లీలా, ఐ.ఈశ్వరమ్మ, ఆర్.గౌరి, ఆర్.పద్మావతి హాజరైనట్టు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీపీవో శ్రీధర్‌రాజా

దత్తిరాజేరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని డీపీవో శ్రీధర్‌రాజా సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని, వివరాలను పీఆర్‌వన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆ రైళ్లను విజయనగరం వరకు పొడిగించాలి

నెల్లిమర్ల: విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వరకు నడుస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలును, విశాఖ నుంచి తిరుపతి వరకు నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును విజయనగరం వరకు పొడిగించాలని టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం నెల్లిమర్ల వచ్చిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించారు.

ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగంలోకి తీసుకురండి


మాట్లాడుతున్న ఎంపీడీవో కిషోర్‌కుమార్

గజపతినగరం: గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కిషోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఆయన గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావడంతో పాటు వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేయాలన్నారు. అలాగే తడి, పొడి చెత్తలను సేకరించి కేంద్రాలకు తరలించే విధంగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇంటింటికీ చెత్త సేకరణకు బుట్టలను అందజేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపరాదు

గజపతినగరం: హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపరాదని వైఆర్‌జీ కౌన్సిలర్ పి.సాయిజ్యోతి తెలిపారు. శుక్రవారం మరుపల్లి గ్రామంలో ఛైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం, వైజీఆర్ కేర్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారిని చిన్నచూపు చూడరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్‌ఎం కృష్ణవేణి, లింక్ వర్కర్ శ్రీదేవి పాల్గొన్నారు.

రాజాం: హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపరాదని జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణరావు అన్నారు. శుక్రవారం సోపేరు గ్రామంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ పథకం ఆధ్వర్యంలో ఏపీ శాక్స్ సహకారంతో ఎయిడ్స్ నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస రావు అందరికీ ప్రభుత్వ పథకాలు అందేటట్లు కృషి చేస్తామన్నారు. బొద్దాం వైద్యాధికారి నరేంద్ర, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనానికి స్థలం కేటాయించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భోగాపురం: భోగాపురం పెదహరిజన వీధిలో సామాజిక భవనం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని పెదహరిజన వీధి గ్రామస్థులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హరిజన వీధిలో అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో ఖాళీ స్థలం ఉందని, దానిని కమ్యూనిటీ హాలు నిర్మించుకోవడానికి మంజూరు చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దరఖాస్తు ఇచ్చినవారిలో జి.శేషగిరి, కె.శ్రీనివాస్, ఎం.తిరుపతిరావు, కింతాడరవికుమార్, బి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

నెల్లిమర్ల: అర్హులైన చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని మోడల్ ఫౌండేషన్ స్కూల్స్ జిల్లా సమన్వయ కర్త అశోక్‌కుమార్ సూచించారు. కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. అంగన్‌వాడీల్లోని పీపీ1, పీపీ2లు, ప్రాథమిక పాఠశాలలోని 1, 2 తరగతుల పిల్లలను కలిపి మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా కొత్త వ్యవస్థ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆల్తి జ్యోతి, ఉపాధ్యాయుడు మద్దిల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

మట్టి విగ్రహాల తయారీపై శిక్షణ

నెల్లిమర్ల: కొండగుంపాం ఉన్నత పాఠశాలలో శుక్రవారం మట్టి వినాయక ప్రతిమల తయారీపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. హెచ్‌ఎం వి.వేణుగోపాలరావు ఉపాధ్యాయుడు సత్యప్రకాష్ పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

శృంగవరపుకోట: ఎస్.కోట పెద్ద వీధిలో శుక్రవారం కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి జుత్తాడ హారిక దోమల నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. దోమకాటుతో జ్వరాలు వ్యాప్తిచెందుతాయని తెలిపారు. వైద్యశిబిరం నిర్వహించారు. మలేరియా అధికారి శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్‌లు శంకర్, రామకృష్ణ తదితరులున్నారు.

ఊపందుకున్న ఉభాలు

- రెండు రోజులు వర్షాలతో రైతుల్లో ఆనందం

గజపతినగరం: ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు అనుకూలించకపోవడంతో రైతులు వరి నాట్లు వేసేందుకు చాలా సమయం పట్టింది. మండలంలోని 9వేల 300 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా ఇంత వరకు 7,200 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. సెప్టెంబరు నెల వచ్చినా వర్షాలు అనుకూలించకపోవడంతో వరి నారు ముదిరిపోయి నాట్లు వేసేందుకు పనికి రాకుండా పోతుందని రైతులు ఆందోళనతో ఉండేవారు. సెప్టెంబరు నెల వచ్చినా వరి నాట్లు పడకపోవడంతో ఒక ప్రత్యామ్నాయ పంటల వైపే వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని అటు అధికారులు, ఇటు రైతులు సిద్ధమవుతున్న సమయంలో గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పురిటిపెంట, సీతారామపురం, పిడిశీల, కాళంరాజపేట, మదుపాడ, మరుపల్లి తదితర గ్రామాల్లో ఉభాలు గురువారం నుంచి ఊపందుకున్నాయి. అలాగే అవసరమైన ఎరువు లను అందుబాటులో ఉండడంతో పాటు వర్షాలు అనుకూలించడంతో రైతులు వరి నాట్లు వేస్తున్నారు.

- ఇటీవల వర్షాల కారణంగా జిల్లాకు రావల్సిన డీఏపీ సకాలంలో రాకపోవడం వల్ల రైతులకు అందడంలేదని మండల వ్యవసాయ అధికారిణి ధనలక్ష్మి తెలిపారు. సోమవారం నుంచి రైతులకు అవసరమైన డీఏపీ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. సమయం మించిన తర్వాత వరినాట్లు వేసే రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని ఆమె కోరారు.


పురిటిపెంటలో వరి నాట్లు వేసేందుకు దమ్ము పడుతున్న రైతులు

మట్టి గణపతినే పూజిద్దాం

- జిల్లాలో విగ్రహాల పంపిణీ

ప్రతిఒక్కరూ మట్టి గణపతినే పూజించాలని పలువురు పిలుపునిచ్చారు. వినాయక చవితి పండగను పురస్కరించుకుని జిల్లాలోని పలు చోట్ల శుక్రవారం ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

- **విజయనగరం దాసన్నపేట:** నగరంలో జిల్లా శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మట్టివినా యక ప్రతిమలు పంపిణీ చేశారు. పార్కు గేటులో ఉన్న సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు, సంఘ ప్రతినిధులు సంజీవరావు, బలివాడ వెంకటరమణరావు పాల్గొన్నారు. ● **విజయనగరం రూరల్:** విజయనగరం నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు గంటా రవి ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. కోట వద్ద జరిగిన కార్యక్రమంలో రవి మాట్లాడుతూ, ఏటా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు.


విజయనగరంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న ఈశ్వరరావు


కోట వద్ద వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న రవి


బొబ్బిలి: మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన, జనసేన నాయకులు


భోగాపురం: మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి


నెల్లిమర్ల: వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎంపీ కలిశెట్టి, బంగార్రాజు


గజపతినగరం: విగ్రహాలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి పడాల అరుణ

గణపతి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

డెంకాడ: మండలంలోగల 26 పంచాయతీల్లో వినాయక ఉత్సవ విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరని ఎస్‌ఐ సన్యాసినాయుడు తెలిపారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. సింగిల్‌విండో సిస్టం ద్వారా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం తెలియజేస్తూ అనుమతులు పొందాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

గుడ్డ సంచుల తయారీపై ఉచిత శిక్షణ



గుడ్డ సంచులను ప్రదర్శిస్తున్న మహిళలు

నెల్లిమర్ల: కాలేజ్ ఆన్ వీల్స్ ప్రాజెక్టు, లెప్రసీ మిషన్ సంయుక్తంగా శుక్రవారం తంగుడుబిల్లి గ్రామంలో మహిళలకు, విభిన్న ప్రతిభావంతులకు గుడ్డ సంచుల తయారీపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ఆన్ వీల్స్ ప్రాజెక్టు ప్రతినిధి డా.తలాడ దీప్తి, బోధకుడు సీహెచ్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ విద్యార్థుల ప్రతిభ


హెచ్‌ఎంతో పతకాలు సాధించిన విద్యార్థులు

నెల్లిమర్ల: అనకాపల్లిలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ ఉన్నత పాఠశాలకు చెందిన బట్టు లోకేష్ 55 కిలోల విభాగంలో కాంస్య పతకం, వల్లూరి రమాదేవి 49 కిలోల విభాగంలో బంగారు, వెండి పతకాలు సాధించారని పీడీ పతివాడ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. వీరిని హెచ్‌ఎం వి.జ్ఞానశంకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

కంచరాం ఎస్సీ కాలనీలో కల్వర్టు పనులు

రాజాం: కంచరాం గ్రామంలోని ఎస్సీ కాలనీలోగల కల్వర్టు పనులు చురుగ్గా చేపడుతున్నారు. సర్పంచ్ గెడ్డాపు అప్పలనాయుడు, పంచాయితీ కార్యదర్శి వెంకటరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చిరంజీవి కాలనీ యూత్ నాయకులు రెయ్యి రామకృష్ణలు శుక్రవారం దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. ఇటీవల నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కృషి మేరకు అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేసినట్టు రామకృష్ణ తెలిపారు

సీఎం సహాయ నిధికి అదితి విరాళం

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు వరద బాధితులు సహాయార్థం విజయనగరం శాసన సభ్యురాలు అదితి గజపతిరాజు తన నెల జీతాన్ని రూ.1,75,000 ముఖ్యమంత్రి సహాయ నిధికి శుక్రవారం విరాళం ఇచ్చారు.

- **గరివిడి:** వరద బాధితుల సహాయార్థం మండలంలోని డీఎఫ్ఎన్‌కు చెందిన ఆర్‌బీ ఎస్ఎస్‌డీఎఫ్ఎం దాస్ సంస్థ అధినేత మనేందర్ మోర్ అలియాస్ మున్నాబాబు రూ.5లక్షలు విరాళంగా ఇచ్చారు. వరద సహాయం నిమిత్తం ఈ చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపించారు.

అయ్యప్ప ఆలయానికి..

చీపురుపల్లి: పట్టణంలో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప ఆలయం కోసం పంచాయతీ ఉద్యోగి నాసిక రామ్మోహనరావు, లీలావతి దంపతులు రూ.50,116 విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని వారు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఎస్వీజీ శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణు, అప్పికొండ ఆదిబాబు, దాసరి రవి, దిలీప్‌కుమార్ ధనూకాలకు శుక్రవారం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

చీపురుపల్లి: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న 9 ట్రాక్టర్లను పట్టుకున్నట్టు ఎస్ఐ ఎల్.దామోదరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇసుకను సంకిలి నుంచి తరలిస్తుండగా, రాజాం రోడ్డు నుంచి చీపురుపల్లి పరిధిలో పట్టుకున్నామని చెప్పారు. నిందితులపై కేసులు నమోదు చేశామని తెలిపారు.